ఘనంగా గడిమైసమ్మ బోనాలు



అలంకరణలో అమ్మవారు



ఫలహారం బండ్ల ఊరేగింపు

మేడ్చల్ గడిమైసమ్మ ఆలయ బోనాల పండగను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అభిషేకం, సహస్రనామాలతో కుంకుమార్చన, ఫలహార బండ్ల ఊరేగింపు, తొట్టెల ఊరేగింపులు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.బోనాల పండగ సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో భక్తులతో కిటకిటలాడింది. –మేడ్చల్

క్లుప్తంగా...

పోచమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో పోచమ్మ తల్లికి నూతనంగా గుడి కట్టడానికి గ్రామస్తులు భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు పూజలు చేసి భూమి పూజ చేసి కొబ్బరి కాయలు కొట్టారు. అందరి సహకారంతో త్వరగా గుడి నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరావు, నాయకులు వెంకటేష్ యాదవ్ , వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్: పట్టణంలోని 17 వార్డులో డాక్టర్ దీన్ దయాళ్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వంద మందికి పరీక్షలు చేసి వైద్యులు అవసరమైన మందులు పంపిణీ చేశారు. మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చౌరస్తాకు అందం తెచ్చిన పాలపిట్ట



మేడ్చల్: పట్టణ సుందరీకరణలో భాగంగా రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన పాలపిట్ట విగ్రహం చౌరస్తాకే అందం తెచ్చింది. జాతీయ రహదారి నుండి రైల్వేస్టేషన్ రోడ్డులో అంబేడ్కర్ భవనం వద్ద చైర్ పర్సన్ ఇంటి పక్కన గల చౌరస్తాలో ఎత్తైన పాలపిట్ట ఆకారం స్టీల్‌తో ఏర్పాటు చేసి అమర్చారు.

ఓటు హక్కు కల్పించాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

మేడ్చల్: ఓటు హక్కు వయస్సు వచ్చిన యువత అందరికీ ఓటు హక్కు కల్పించాలని కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్ అన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని 67,68,69,70,71 పోలింగ్ స్టేషన్లను సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలజ, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన

కీసర: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలు, మండలాల్లో బూత్‌స్థాయిలో ఓటరు నమోదు కార్యక్రమంపై ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన లభించింది. నాగారంలోని 17వ వార్డులో గల బూత్‌లో ప్రత్యేక క్యాంప్‌ను మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి పరిశీలించారు.

విద్యతోనే సమాజంలో మార్పు



జవహర్‌నగర్: విద్యతోనె సమాజంలో మార్పు వస్తుందని షర్మిల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు షర్మిల అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. తరంలో ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని కోరారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ రోడ్డులో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహా రెడ్డి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి వినతి మేరకు దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవరాజు, హరికృష్ణ యాదవ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



ఘట్‌కేసర్‌లో నిరసన తెలుపుతున్న ముదిరాజ్‌లు

ఘట్‌కేసర్: అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని, సీట్లు ఇచ్చే పార్టీలకే మద్దతిస్తామని ముదిరాజ్ యూత్ మేడిపల్లి కన్వీనర్ దొంతి నవీన్ ముదిరాజ్, ఘట్‌కేసర్ మండల కన్వీనర్ ఉదారి శివశంకర్‌ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని గట్టుమైసమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ముదిరాజ్‌ల నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడ కేటాయించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన బీఆర్‌టీయు నాయకులు



మేడ్చల్: మంత్రి మల్లారెడ్డిని బీఆర్ఎస్ అనుబంధ కార్మిక యూనియన్ బీఆర్‌టీయు జిల్లా నాయకులు మంత్రి మల్లారెడ్డిని కలిశారు. కార్మికులు బీఆర్ఎస్ కు అండగా ఉన్నారని రాబోయే ఎన్నికలలో అండగా ఉంటారని బీఆర్‌టీయు అధ్యక్షుడు సంభ ప్రభాకర్ అన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి భారీ స్పందన లభించింది. 705 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడలు

మేడ్చల్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 29,30 తేదీలలో మేడ్చల్ దుండిగల్ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి నాగరాజు తెలిపారు.అండర్–14. అండర్–17 విభాగాలలో బాలబాలికలకు ఖోఖో,కబడ్డీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుండిగల్ మండలం బౌరంపేట్ లోని శ్రీవేద యూనివర్సల్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే సెలక్షన్స్‌కు ఈనెల 28న ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు తమ జట్లను పంపాలని కోరారు.

ఓటరు నమోదు కార్యక్రమం



పూడూర్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు ఫామ్‌లను నింపుతున్న ఓటర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కొనసాగింది. రెండు రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ఎత్తున స్పందన లభించింది.

జవహర్‌నగర్ అభివృద్ధే లక్ష్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో ముందుంచుతామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం టీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు బాషగోని కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ పదేళ్లలోనే వందేళ్ల అభివృద్ధిని చేసి చూపించి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మేయర్ కావ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన సీఐ

కీసర: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రవీందర్ నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన 19 సీసీ కెమెరాలను ఆయన మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంగధర్మేందర్, ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బోడుప్పల్: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. భీంరెడ్డినగర్ కాలనీ యువకులకు ఆయన ఆదివారం క్రికెట్ కిట్స్‌ను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం యువతీ యువకులను క్రీడల్లో రాణించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ, అన్ని రకాల క్రీడా సౌకర్యాలను కల్పిస్తోందన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



మృతుడు బాల్‌రాజ్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి తెలిపిన మేరకు.. పట్టణంలోని కిందిబస్తీలో నివాసం ఉండే పంజగారి బాల్‌రాజ్(23) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత శనివారం ఉదయం ఇంటి నుండి బయటికి వెళ్లాడు. పట్టణంలోని బీఆర్ వైన్స్ వద్ద సాయంత్రం ముగ్గురు మిత్రులతో కలిసి పర్మిట్ రూమ్‌లో మద్యం తాగారు. అనంతరం బాల్‌రాజ్ పర్మిట్ రూం నుండి బయటికి వస్తుండగా మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు.స్పృహ కోల్పోయి అక్కడికక్కడే మరణించాడు. తోటి మిత్రులు గమనించకుండా అలాగే మద్యం సేవిస్తుండగా మిగతా వారు కొంత సమయం వరకు మద్యం మత్తులో పడుకుని ఉండవచ్చనుకున్నారు. రాత్రి అవుతున్నా ఎంతకీ లేవకపోవడంతో స్థానికులు పరిశీలించి మరణించినట్లు నిర్ధారణకు వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో విషయం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలికి చేరుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.


రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి



రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డితో కమిటీ సభ్యులు

ఘట్‌కేసర్: రెడ్డి సంక్షేమ సంఘం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా కట్ట జనార్ధన్‌రెడ్డి ఆదివారం ఎన్నికయ్యారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యలయంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా గడీల సంజీవరెడ్డి, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, కోశాధికారిగా ఆల్వ జైపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడిని పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

బంజారా హక్కుల సాధనకు కృషి



సమావేశంలో పాల్గొన్న సేలాలాల్ బంజారా శాంతినగర్ సభ్యులు

జవహర్‌నగర్: బంజారా హక్కుల సాధనకు కృషి చేస్తానని సేవాలాల్ బంజారా శాంతినగర్ నూతన కమిటీ అధ్యక్షుడు బోడ రవీందర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీనగర్ శాంతినగర్‌లో సేవాలాల్ బంజారా సంఘ సభ్యుల సమావేశం జరిగింది. బోడ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. బంజారాలకు రావల్సిన హక్కుల సాధించుకుంటామని ముఖ్యంగా విద్యారంగంలో నేటితరం యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. జవహర్‌నగర్‌లో బంజారాలకు స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాము మృతదేహం

కీసర: రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లిచౌరస్తా వద్ద చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం పర్వాతాపూర్‌కు చెందిన జింకోల రాము(30) ద్విచక్రవాహనంపై కీసర మండలం నర్సంపల్లిలోని తన అత్తగారింటికి వచ్చి తిరిగి వెళుతుండగా అంకిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రాము రోడ్డుపై పడి తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య చిన్న వయసున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధి ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. హరిత హారంలో భాగంగా 7వ డివిజన్‌లో ఆదివారం చేపట్టిన ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరం మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకుందామన్నారు. అలాగే 3వ డివిజన్ వెంకటసాయినగర్ కాలనీ రూ. 16లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి, మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి, కొత్త చందర్‌గౌడ్, సీసా వెంకటేశ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఉచిత బీమా

మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని 4,779 మందికి ప్రయోజనం



సాక్షి, మేడ్చల్ జిల్లా: పల్లె ప్రగతిని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం ఆతర్వాత ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టరు అందజేసింది. అవసరమైన పారిశుద్ధ్య కార్మికుల నియమించుకోవాలని సూచించింది. పంచాయతీల్లో జనాభాను బట్టి మార్గదర్శకాలకు అనుగుణంగా కార్మికుల నియామక ప్రక్రియ చేపట్టాయి. పాలకవర్గాలు, కార్మికులను నియమించుకుని వారికి నెల రూ.8,500 వరకు వేతనాలు అందజేస్తున్నారు. కేవలం వేతనం తప్ప ఇతర సామాజిక భద్రత లేకపోవటం వల్ల పంచాయతీ కార్మికుల్లో ఆందోళన ఉండేది. వివిధ కారణాల వల్ల మరణిస్తే కనీసం బీమా సౌకర్యం కూడా లేని పరిస్థితి. మరీ ముఖ్యంగా రోజువారీగా గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయటం, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతరత్రా పారిశుద్ధ్య పనుల కారణంగా వీరు అనారోగ్యం పాలైన సందర్భాలున్నాయి. చికిత్సల పరంగా వీరికి సహకారం అందే పరిస్థితి లేదు. ఈక్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి పంచాయతీ కార్మికుడికి ఉచితంగా ప్రభుత్వమే బీమా చేయాలని నిర్ణయించి ఆ దిశగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలలో 4,779 మంది పారిశుద్ధ్య కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.అలాగే,శివారు జిల్లాలలోని మొత్తంగా ఉన్న 619 గ్రామ పంచాయతీలపై ఏటా రూ.6.50 కోట్ల వరకు అదనపు భారం పడనున్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ నుంచే ప్రీమియం...

రైతు బీమా పథకంలో పట్టాదారు అయిన రైతు మరణిస్తే మరణం ఎలాంటిదైనా రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతోంది. అలాగే, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కూడా ఇదే విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద నమోదైన పంచాయతీ కార్మికుడు మరణిస్తే వారి నామినీకి లేదా కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము అందనుంది. బీమా ప్రీమియం సొమ్ము పంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల బీమా ప్రీమియం సొమ్ము చెల్లించేలా తక్షణం చర్యలు చేపట్టాలని డీపీవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఇక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు మరణిస్తే గతంలో అంత్యక్రియల కోసం రూ.5 వేలు ప్రభుత్వం ఇచ్చేది.. దాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది కూడా గ్రామ పంచాయతీ నిధుల నుంచే ఇవ్వాల్సి ఉంటుంది.

మార్గదర్శకాలు రాగానే..

ప్రభుత్వం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల బీమాపై నిర్ణయం తీసుకుంది. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తాం. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణే కీలకం ... అనునిత్యం ప్రజలకు సేవలందించే పారిశుద్ధ్య కార్మికులకు మేలు జరుగుతుందని భావిస్తున్నాం.

\- రమణమూర్తి , జిల్లా పంచాయతీ అధికారి,మేడ్చల్-మల్కాజిగిరి



బోనమెత్తిన ఎమ్మెల్సీ కవిత

పోచారం: పోచారంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయంలో ఆదివారం అమ్మవార్ల విగ్రహ పతిష్టతో పాటు వైభవంగా బోనాల సంబరాలు జరిగాయి. పోచారంలోని బొడ్రాయి నుంచి గ్రామ దేవతల ఆలయం వరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోనం తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలోని పోచమ్మ, ఈదమ్మ, మహంకాళి, మైసమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హెలికాప్టర్‌తో ఏర్పాటు చేసిన పూల వర్షం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ సన్నద్ధం

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో 632 టీచర్ పోస్టులు ఖాళీ



సాక్షి, మేడ్చల్ జిల్లా : డీఎడ్, బీఎడ్ పూర్తి చేయడంతోపాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులైన వారు ఏళ్లుగా ఎదురుచూస్తున్న టీఆర్టీ (టీచర్స్‌రిక్రూట్‌మెంట్ టెస్ట్)పై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటన చేయడంతో ఉద్యోగార్థుల్లో ఆశలు చిగురించాయి. దీనికి సంబంధించిన జీవో కూడా ఆర్థికశాఖ జారీ చేయడంతో మరింత స్పష్టత వచ్చింది.

ఆరేళ్ల నిరీక్షణకు తెర..

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 2017లో టీఆర్టీ నిర్వహించారు. ఆ తర్వాత నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది. గతేడాది ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఆ ప్రక్రియ అనంతరం నియామకాలు చేపడతారని భావించారు. అయితే..కోర్టు కేసుతో నిలిచిపోవటం, నియామకాలకు అడ్డంకిగా మారిందని పేర్కొనటంతో ఆశలు ఆవిరయ్యాయి. కోర్టులో బదిలీల కేసు వాయిదా పడుతుండటం, ఎన్నికలు సమీపిస్తుండటంతో విశ్వాసం సన్నగిల్లింది. టెట్ ప్రకటన ఇచ్చినప్పటికీ ఎన్నికల ముందు టీఆర్టీ వేయరని అనుకున్నారు. కానీ మంత్రి ప్రకటనతో హర్షం వ్యక్తమవుతోంది.

గ్రేటర్‌తో సహా శివారుల్లో ఉపాధ్యాయ ఖాళీలు 632

గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఆయా విద్యాశాఖ కసరత్తు చేస్తున్నాయి. అందులో భాగంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలను విద్యాశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో మొత్తంగా ఉపాధ్యాయ పోస్టులు 632 ఖాళీగా ఉండగా, ఇందులో స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 189, ఎస్‌జీటీ పోస్టులు 325, భాషాపండితుల పోస్టులు 89, పీఈటీల పోస్టులు 29 ఉన్నాయి. జిల్లాల వారిగా ఇలా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 25,ఎస్‌జీటీలు 45, భాషా పండితులుడు, పీఈటీలు ఒకటి ఖాళీగా ఉండగా, రంగారెడ్డి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 48,ఎస్‌జీటీ 117, భాషా పండితులు 25, పీఈటీలు ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, హైదరాబాద్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 116, ఎస్‌జీటీలు 163, భాషాపండితులు 57, పీఈటీలు 22, పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వార్డు కార్యాలయం నిర్మాణ పనుల పరిశీలన



వార్డు కార్యాలయం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ.78 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వార్డు కార్యాలయం పనులను ఆదివారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హనుమాన్‌నగర్ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ యువజన సంఘం భవనం పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నేత సాయిజెన్‌శేఖర్ తది తరులు ఉన్నారు.